

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## మహబూబ్‌నగర్





నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట

బుధవారం, జూన్ 10, 2026 పేజీలు :4


### నెట్టెంపాడు భూసేకరణ 45 రోజుల్లో

# పూర్తి చేయాలి

**ఎత్తిపోతల పథకాల భూసేకరణ వేగవంతం చేయాలని ఆర్అండ్ఆర్ కమిషనర్ ఆదేశం**



గద్వాల జూన్ 09(ప్రజా జ్యోతి ప్రతినిధి):జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా వివిధ ప్యాకేజీల పరిధిలో సేకరించాల్సిన 534 ఎకరాల భూమిలో ఎలాంటి వివాదాలు,న్యాయపరమైన ఇబ్బందులు లేని భూసేకరణ ప్రక్రియను ప్రభుత్వ ఆదేశాల మేరకు 45 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆర్అండ్ఆర్ (పునరావాసం,పునరుద్ధరణ) కమిషనర్ శివకుమార్ నాయుడు ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నెట్టెంపాడు,గట్టు ఎత్తిపోతల

## ఈవీఎం గోదాం త్రైమాసిక తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్



### నేరాల నియంత్రణ,సైబర్ మోసాల నివారణపై ప్రత్యేక

# దృష్టి సారించాలి

**జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు**

**నాణ్యమైన దర్యాప్తుతో బాధితులకు న్యాయం చేయాలి**




గద్వాల జూన్ 09(ప్రజా జ్యోతి ప్రతినిధి):జిల్లాలో నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడంతో పాటు ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి బాధితులకు పూర్తి న్యాయం జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మంత్లీ క్రైమ్ రివ్యూ సమావేశంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పనితీరు,పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి,నేరాల నియంత్రణ

## పాలమూరు-రంగారెడ్డి

# నిర్వాసితులకు భారీ ఊరట

**-637.15 కోట్ల నిధులకు ప్రతిపాదనలు**

**-ఫలించిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి కృషి**

**-25 కోట్ల నిధులు మంజూరు**





**నాగర్ కర్నూల్ : జూన్ 09(ప్రజా జ్యోతి)**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలపథకం పరిధిలో భూములు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు పరిహారం,పునరావాసం,మౌలిక సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది.ఈ మేరకు 637.15 కోట్ల నిధుల మంజూరుకు నీటిపారుదల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.ఈ నిధుల్లో ఆర్ �ౘ ఆర్ (రీహాబిలిటేషన్ అండ్ రీసెటిల్‌మెంట్) పనులు, గృహ నిర్మాణాలు,నగదు ప్రయోజనాలు, పునరావాస కాలనీల అభివృద్ధికి

587.15 కోట్లు, మిగిలిన భూసేకరణ పూర్తి చేయడానికి 50 కోట్లు అవసరమని అధికారులు నివేదిక అందించారు.

వట్టెం రిజర్వాయర్ పరిధిలోని భూ నిర్వాసితుల కుటుంబాల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన నాగర్‌కర్నూల్

### నేరాల నియంత్రణ,సైబర్ మోసాల నివారణపై ప్రత్యేక

# దృష్టి సారించాలి

చర్యలపై ఎస్పీ సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా పకడ్బందీగా వ్యవహరించాలని సూచించారు. బాధితులకు న్యాయం చేయడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. సీసీటీఎన్ఎస్ (2.0) వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించాలని,ప్రతి కేసును సకాలంలో నమోదు చేసి సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు.సీసీటీఎన్ఎస్‌లో అందుబాటులో ఉన్న అన్ని ఫీచర్లు,సాధనాలను పూర్తిస్థాయిలో వినియోగించడం ద్వారా పారదర్శకత,సమాచార సమన్వయం,సేవల నాణ్యత మెరుగుపడుతుందని తెలిపారు.రోడ్డు ప్రమాదాలు,ఆర్థిక నేరాలు,ఆన్‌లైన్ మోసాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.ముఖ్యంగా సైబర్ నేరాల నివారణకు గ్రామ స్థాయి వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.అక్రమ గంజాయి రవాణా,మట్కా,జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల వ్యవస్థను విస్తరించి,అవి నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాదాలు అధికంగా జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరుస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని,మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.గ్రామ స్థాయి పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని,విలేజ్ పోలీస్ అధికారులు గ్రామాల్లో తరచూ పర్యటిస్తూ ప్రజలతో మమేకమై సామాజిక సమస్యలను తెలుసుకోవడంతో పాటు ముందస్తు సమాచార సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.సమావేశంలో అదనపు ఎస్పీ కె.శంకర్,గద్వాల డీఎస్పీ వై.మొగిలయ్య,సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు,జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సైలు,స్టేషన్ రైటర్లు,సీసీటీఎన్ఎస్ సిబ్బంది,ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# నెట్టెంపాడు భూసేకరణ 45 రోజుల్లో పూర్తి చేయాలి

పథకాలతో పాటు మల్లమ్మకుంట రిజర్వాయర్‌కు అవసరమైన భూసేకరణపై కమిషనర్ శివకుమార్ నాయుడు,జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ,ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులపై ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో భూసేకరణ ఆలస్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు.ప్రాజెక్టుల అమలులో ఉన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సీఎం ఆదేశించారని పేర్కొన్నారు.గట్టు ఎత్తిపోతల పథకానికి 462 ఎకరాలు,ఆర్డీఎస్ పరిధిలోని తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ఫేజ్-2లో నిర్మిస్తున్న మల్లమ్మకుంట రిజర్వాయర్‌కు 567 ఎకరాల భూమి సేకరించాల్సి ఉందన్నారు.నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభమై చాలా సంవత్సరాలు గడిచినందున దీనికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.నెట్టెంపాడు పథకం పరిధిలోని మొత్తం 534 ఎకరాల్లో కోర్టు కేసులు,ఇతర సమస్యలు లేని సుమారు 220 ఎకరాలకు ఈ నెల15వ,తేదీలోగా ప్రాథమిక ప్రకటన (ప్రిలిమినరీ డిక్లరేషన్)జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.భూసేకరణ పూర్తయితేనే ఎత్తిపోతల పథకాల పనులు సకాలంలో పూర్తై,ఆయకట్టు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించగలమని చెప్పారు.వివిధ రిజర్వాయర్ల నిర్మాణంతో ముంపునకు గురైన గ్రామాల ప్రజలకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం వివిధ మండలాల పరిధిలోని గ్రామాల్లో భూసేకరణ పురోగతిపై అధికారులతో విస్తృతంగా చర్చించారు.జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ, భూసేకరణ సందర్భంగా రైతుల నుంచి అభ్యంతరాలు వచ్చినట్లయితే ప్రభుత్వ అవసరాలు,ప్రాజెక్టుల ప్రాధాన్యతను వివరించి వారిని ఒప్పించాలని సూచించారు. రెవెన్యూ,సర్వే,నీటిపారుదల శాఖల అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.సమావేశంలో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ,ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజినీర్ రహీముద్దీన్,సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ నూకరాజు,కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి,వివిధ మండలాల తహసీల్దార్లు,నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాం త్రైమాసిక తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్

నారాయణపేట ప్రతినిధి జూన్ 09 (ప్రజా జ్యోతి)
మంగళ వారం జిల్లా కలెక్టర్ ప్రియాంక జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహించారు.

ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్ ను పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, అగ్నిప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర భద్రతా పరికరాలను తనిఖీ చేశారు.

అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు జారీ చేశారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...

భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి రాజీ లేకుండా 24 గంటలు భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, గోదాంలోని భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ జయ సుధ, తహసీల్దార్ అమరేంద్ర కృష్ణ, మున్సిపల్ కమిషనర్ శంకర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### పాలమూరు-రంగారెడ్డి

# నిర్వాసితులకు భారీ ఊరట

నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేడా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ప్రజా ప్రభుత్వం ఆర్‌డఆర్ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు అదనంగా

25 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.వట్టెం రిజర్వాయర్ పరిధిలో 466 నిర్వాసిత కుటుంబాలకు ఇప్పటికే 53.20 కోట్ల పరిహారం,29.93 కోట్ల రూపాయలు నిర్మాణ వ్యయంతో మొత్తం 83.13 కోట్లు ఖర్చు చేశారు.అయినప్పటికీ పునరావాస కాలనీల్లో రోడ్లు,తాగునీరు,విద్యుత్,గృహ నిర్మాణాలతో పాటు ఇతర మౌలిక వసతుల పనులకు మరిన్ని నిధులు అవసరమని ఎమ్మెల్యే డాక్టర్.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి నిర్వాసిత కుటుంబాలకు చెల్లించాల్సిన పరిహారం,విద్యుత్, గృహ నిర్మాణాలు,రోడ్లు,తాగునీటి వంటి మౌలిక వసతుల కల్పనలో జాప్యం లేకుండా నిధులను విడుదల చేయాలని ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని కోరగా ఎమ్మెల్యే విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నిర్వాసితులలో ఆనందాన్ని కలిగించింది.35,200 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నాగర్‌కర్నూల్,మహబూబ్‌నగర్,

నారాయణపేట,వికారాబాద్,రంగారెడ్డి,నల్గొండ జిల్లాల్లోని 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతూ ప్రాజెక్టు నిర్మాణం కోసం అవసరమైన 27,079.59 ఎకరాల భూమిలో 26,882.95 ఎకరాల భూసేకరణ ఇప్పటికే పూర్తికాగా,కేవలం 196.64 ఎకరాల భూసేకరణ పెండింగ్‌లో ఉంది. పెండింగ్లో ఉన్న భూసేకరణను పూర్తి చేయడానికి 50 కోట్లు అవసరమని అధికారులు నివేదించారు.

ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపితే వేలాది నిర్వాసితుల కుటుంబాలకు ఉపశమనం లభించడంతో పాటు పెండింగ్‌లోఉన్న పునరావాస పనులు వేగవంతమై భూసేకరణ ప్రక్రియ పూర్తై ప్రాజెక్టు పనులలో వేగం పుంజుకునే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.



### శ్రీరంగాపురం మండల కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనికి

శ్రీరంగాపురం జూన్ 9 శ్రీరంగాపురం మండలం పరిధిలోని లక్ష్మీ వారహి ఇండస్ట్రీస్ జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా మిల్లుల గోదాముల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గోదాములు, మిల్లుల వద్ద వరి ధాన్యాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరగా అన్‌లోడ్ చేసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లుల్లో వేగంగా దించుకోవాలని స్పష్టం చేశారు. లారీలలో ఉన్న ధాన్యం పై టార్పాలిన్లు కప్పి ఉంచాలన్నారు. మిల్లుల వద్ద లారీలను ఎక్కువ సమయం వేచి ఉంచకుండా తగ్గించేందుకు గాను హమాలీల (కార్మికుల) సంఖ్యను పెంచుకోవాలని మిల్లర్లకు చెప్పారు. మిల్లుకు వచ్చిన ధాన్యం లారీలను ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేస్తూ రోజువారీ అన్లోడ్ సామర్థ్యాన్ని పెంచాలని, ఎక్కడా లారీలు ఎక్కువ సమయం వేచి ఉండకుండా చూడాలని అధికారులను, మిల్లర్లను ఆదేశించారు. ఇంకా ధాన్యం నిల్వ చేయడానికి గోదాములను సిద్ధం చేయాలని పౌర సరఫరాల అధికారికి సూచించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, రెవెన్యూ అధికారులు, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



## అప్పక్ పల్లి- కోటకొండ-కోయిలకొండ రోడ్డు అసంపూర్తి పనులు వెంటనే పూర్తి చేయాలి .

**- బి. రాము ,జిల్లా కార్యదర్శి సిపిఐ(ఎంఎల్ )మాస్ లైన్ పార్టీ డిమాండ్**
**- కె. కాశీనాథ్ సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి డిమాండ్**
**15న పాదయాత్ర, 16న మహా ధర్నా రాస్తారోకో, 17 రాస్తారోకో**




నారాయణపేట ప్రతినిధి జూన్ 09 (ప్రజా జ్యోతి)

సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యాలయం (భగత్సింగ్ భవన్) లో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ (ఎంఎల్ )మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి బి రాము, డివిజన్ కార్యదర్శి కె.కాశీనాథ్ మాట్లాడుతూ
నారాయణపేట జిల్లా కేంద్రం నుండి మహబూబ్నగర్ జిల్లా కేంద్రాని కలిపే ప్రధానమైన రెండు వరుసల రోడ్డును ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కొడంగల్ నియోజకవర్గం రోడ్డు పనులన్నీ వెంట వెంటనే పూర్తవుతాయి. కానీ నారాయణపేట నియోజకవర్గ రోడ్లు ఎందుకు అసంపూర్తిగా మిగులుతున్నాయో అర్థం కావడం లేదు. నారాయణపేట కొడంగల్ రెండు నియోజకవర్గాలు రెండు కళ్ళలాగా నాకు ఉంటాయి అని పిసిసి అధ్యక్ష హోదాలో రేవంత్ రెడ్డి ఎన్నికల సభలో మాట్లాడారు. నారాయణపేట నియోజకవర్గం ప్రజలకు హామీ ఇచ్చారు. కొడంగల్ రోడ్లు మాత్రమే పూర్తి అవుతున్నాయి. కొడంగల్ నియోజకవర్గంలో పని చేస్తే బిల్లులు తొందరగా వస్తాయని కాంట్రాక్టర్లు అక్కడి రోడ్లనే పూర్తి చేస్తున్నారు. నారాయణపేట నియోజకవర్గ రోడ్లను కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదన్నారు. అసంపూర్తిగా పనులు చేశారు. అప్పకుపల్లి నుండి కోటకొండ మధ్యలో నాలుగు కిలోమీటర్లు, కోటకొండ గ్రామంలో రెండు కిలోమీటర్లు, కోటకొండ కోయిలకొండ మధ్యలో ఆరు కిలోమీటర్లు రోడ్డును పూర్తి చేయాల్సి ఉంది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా చలనం లేదు. దీంతో సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో 2026 జూన్ 15న ఉదయం 9 గంటలకు కోటకొండ భగత్ సింగ్ విగ్రహం నుండి పాదయాత్ర ప్రారంభమై నారాయణపేట జిల్లా కలెక్టరేట్ కు చేరుకుంటుంది. 16 జూన్ 2026న నారాయణపేట జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌరస్తా లో రాస్తారోకో, 17 జూన్ 2026 ను నారాయణపేట జిల్లా కేంద్రంలో ధర్నా, తదితర ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని" మాస్ లైన్ భావించింది.
ప్రధానంగా రోడ్డు ఒక జిల్లా కేంద్రం నుండి ఇంకో జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డు కావడంతో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుంది. రోజువారీగా వందలాది వాహనాలు, వేలాది ప్రజలు రోడ్డుపై ప్రయాణిస్తారు. ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు తీరవేసేందుకు ప్రభుత్వం ఆర్టీసీ బస్సులు నడుపుతుంది. రోడ్డు స్థితి బాగా లేక ఆర్టీసీ బస్సులకు వచ్చే ఆదాయం కంటే రిపేరుకే ఎక్కువ ఖర్చు అవుతుందని ఆర్టీసీ తన బస్సు సర్వీసులను ఈ రోడ్డుపై రద్దు చేసింది. ప్రయాణికులు తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు ఆటోలను ఆశ్రయించాలి. అతిపెద్ద ఆర్టీసీ సంస్థ రిపేర్ల బాధ భరించలేదంటే..! ఆటో డ్రైవర్స్ ఆటోల రిపేరి బాధ, ద్విచక్ర, కారు తదితర వాహనాల రిపేరి బాధ భరించడం ఎంత కష్టమో...!! ఆటో డ్రైవర్ న్ భరించడం చాలా భారంతో కూడుకున్నది. ఆటోలను ఈ రోడ్డు పోయి నడిపితే రిపేర్ కి కూడా సరిపోవడం లేదు. మా ఫైనాన్స్ సంగతి దేవుడెరుగు.. అంటున్నారు. దీనికి తోడు అనారోగ్య సమస్యలు కూడా వస్తున్నాయి. వర్షం కురిసింది అంటే రోడ్డు అంతా బురద మాయం అవుతుంది. రోడ్డుపై వాహనాలు నడిపే వాహనదారుల బాధ వర్ణనాతీతం.
కావున సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ లైన్ పార్టీ అనేకసార్లు జిల్లా కలెక్టర్కు, స్థానిక ఎమ్మెల్యే కు విన్నవించిన చేస్తామని చెప్పడమే, అసంపూర్తిగా ఉన్న రోడ్డు పని మాత్రం పూర్తి చేయడం లేదు. పెండింగ్ లో ఉన్న రోడ్డు పనిని వెంటనే పూర్తి చేయాలని సిపిఐ (ఎంఎల్ ) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో 15,16,17 జూన్ 2026 ల లో మూడు రోజులపాటు వివిధ రకాల ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించింది. కాబట్టి ఈ ప్రాంత ప్రజలు, ప్రయాణికులు, విద్యార్థులు, యువకులు, మహిళలు, ప్రజాస్వామికవాదులు, ప్రాంత అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని పై మూడు రోజుల అప్పక్ పల్లి, కోటకొండ, కోయిలకొండ రోడ్డు సాధన ఉద్యమంలో పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ విలేకరుల సమావేశం ద్వారా ప్రజలకు కోరుతున్నది. ఈ విలేకరుల సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి యాదగిరి, మండల కార్యదర్శి బి నరసింహా, గ్రామ కార్యదర్శి హాజీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రశాంత్, రైతు సంఘం జిల్లా నాయకులు బాలకృష్ణ, టియుసిఐ జిల్లా నాయకులు ఎదురింటి నరసింహులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వెంకట్ రాములు, పి వై ఎల్ నాయకులు సలీం,మంగలి హనుమంతు, నారాయణపేట టౌన్ నాయకులు నజీర్ అహ్మద్, హరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ సెల్ అధ్యక్షుడు వంకేశ్వరం నిరంజన్ కు సన్మానం




నాగర్ కర్నూల్ : జూన్ 09 (ప్రజా జ్యోతి)
నాగర్ కర్నూల్ జిల్లా ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఇటీవలే జిల్లా ఎస్సీ సెల్అధ్యక్షుడిగా ఎన్నికైన వంకేశ్వరం నిరంజన్ ను మంగళవారం రాధాకృష్ణ భవన్లో సన్మానించారు. విశ్రాంత ఉద్యోగి అయిన నిరంజన్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ విభాగానికి అధ్యక్షులుగా ఎంపికైన సందర్భంగా తమ సంఘ సభ్యులు పార్టీ పరంగా పదవి పొంది ఎంతోమంది అణగారిన వర్గాలకు తన సహాయ సహకారాలు అభివృద్ధికి తోడ్పడే విధంగా పనిచేసే అవకాశం పొందారని రాబోయే రోజుల్లో పదవికి వన్నెతెస్తూ మరెన్నో ఉన్నతమైన పదవులు పొందాలని సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీధర్,కార్యదర్శి వెంకట్ శెట్టి,మండల శాఖ అధ్యక్షుడు,బు సిరెడ్డి సుధాకర్ రెడ్డి,సంజీవ గౌడ్,కార్యదర్శి యుగంధర్ రెడ్డి,వెంకట్ రెడ్డి,పోల శ్రీనివాసులు,వీరేశలింగం,లక్ష్మీ నారాయణ,మేస్త్రి వెంకట్ స్వామి,ప్రభాకర్,సింహారెడ్డిలతో,విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు

## పోలేరమ్మకుమొక్కులు చెల్లించుకున్న కుర్వ కులస్తులు.



నారాయణపేట ప్రతినిధి జూన్ 9 ప్రజా జ్యోతి
నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ లో కురువ కులస్తుల ఆధ్వర్యంలో మంగళవారం పోలేరమ్మ జాతర మహోత్సవాన్ని ఎంతో కన్నుల పండుగగా నిర్వహించారు.ముందుగా అమ్మవారికి సమర్పించేందుకు బోనాలను తమ తమ ఇంటిలో నియమ నిష్టలతో తయారు చేసుకొని సాయంత్రం అమ్మవారికి బోనాలను సమర్పించేందుకు డబ్బు మేళాలతో గ్రామపురవీధుల గుండా ఊరేగింపుతో అమ్మవారి దేవాలయానికి చేరుకున్నారు.అనంతరం మహిళలు అమ్మవారికి సమర్పించేందుకు బోనాలతో దేవాలయం చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేపట్టి అమ్మవారికి సమర్పించారు.ఈ సందర్భంగా కురువ కులస్తులు పెద్దలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా అమ్మవారిని బోనాలతో మేకలు కోళ్లు లతో అమ్మవారికి సమర్పించి తమ తమ మొక్కులను తీర్చుకుంటామనితెలిపారు.

# విద్యా-ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి

### :ఎస్టీయూ అధ్యక్షులు శ్రీధర్ రావు




నాగర్ కర్నూల్ : జూన్ 09 (ప్రజా జ్యోతి)

ఎస్.టి.యు ఎనభై యవ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా అధ్యక్షులు కొత్త శ్రీధర్ రావు మంగళవారం సంఘ కార్యాలయంలో జెండాను విష్కరించి ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టేట్ టీచర్స్ యూనియన్ తన 79 సంవత్సరాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుందని,ఈ సంఘం 1947 జూన్ లో స్థాపించబడి ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ,సంక్షేమం,విద్యా అభివృద్ధికి నిరంతరం పనిచేస్తోందన్నారు.ఉపాధ్యాయుల వేతనాలు, పదోన్నతులు,సేవా భద్రత వంటి అంశాలపై అలుపెరగని పోరాటాలు చేసిందని ప్రభుత్వ పాఠశాలల బలోపేతం,నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తుందని,విద్యా రంగంలో వచ్చిన మార్పులు,సంస్కరణలలో ఎస్టీయూ కీలక పాత్ర పోషించిందని.ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాల కోసం కృషి చేసిందన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి, విద్యార్థుల శ్రేయస్సుకు సేవలు అందించి ఈ 80సంవత్సరాల చరిత్రలో అనేక మంది నాయకులు, కార్యకర్తలు సంఘాన్ని బలోపేతం చేశారన్నారు. భవిష్యత్తులోనూ ఉపాధ్యాయ సంక్షేమం,విద్యా నాణ్యత పెంపు మరియు,ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతం లక్ష్యాలుగా కొనసాగుతామని,నలభై రోజుల కింద ముఖ్యమంత్రి ఇచ్చిన తక్షణ హామీ లలో పీఆర్సీ,హెల్త్ కార్డులు,సీ.పీ.యస్ అమలు కాకపోగా 16 వేల ప్రాథమిక పాఠశాలలలో నాల్గు వేల ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించాలనడం, క్షేత్రస్థాయిలో పబ్లిక్ స్కూల్స్ కు తగిన ఏర్పాట్లు, వసతులు కల్పించకుండానే అడ్మిషన్లు అయ్యే సమయంలో ప్రారంభిస్తామనడం సరికాదన్నారు.
ఈ కార్యక్రమంలో ఎస్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి,పూర్వ అధ్యక్షులు మురళి,ఎస్.టి.యు రాష్ట్ర నాయకులు రమేష్, అనిల్ కుమార్ రెడ్డి,ప్రభాకర్,జిల్లా/మండలాల ప్రతినిధులు ఎ.హన్మంత రెడ్డి,మద్దిలేటి,హన్మంతు, ఈశ్వర్,కర్ణాకర్ రెడ్డి,బాలస్వామి,నర్సింహ్మ,సురేష్ బాబు,సత్యనారాయణ,వెంకట్స్వామి,నారాయణరాజన్ గౌడ్,రాజేష్,లక్ష్మి నరసింహ రెడ్డి మొదలైన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కిరణ్ బేడీ జయంతి సందర్భంగా మహిళా పోలీసులకు సన్మానం

నాగర్ కర్నూల్ : జూన్ 09 (ప్రజా జ్యోతి)
భారత దేశ తొలి మహిళా ఐ.పి.ఎస్ అధికారి కిరణ్ బేడీ జయంతి సందర్భంగా నాగర్కర్నూల్ జిల్లా క్లాస్మేట్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు సమక్షంలో జిల్లా ఎస్పీకార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీస్ సిబ్బందిని సన్మానించారు.కార్యక్రమంలో ఏవో కృష్ణయ్య,ఆ× శంకర్,క్లాస్మేట్ క్లబ్ సభ్యులు,అధికారులు,డిపిఓ సిబ్బంది ఉన్నారు.



## చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండాలి

నాగర్ కర్నూల్ : జూన్ 09 (ప్రజా జ్యోతి)
రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ ఆధ్వర్యంలో తిమ్మాజిపేట మండలంలోని అప్పాజీపల్లి గ్రామ పంచాయతీ మంగళవారం "లీగల్ అవేర్నెస్"కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీ రామ్ హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాల గురించి, వాటి నుండి ఎలా బయట పడాలో వివరించారు. ఎవరైన ప్రజలు న్యాయ వాదిని నియమించుకునే ఆర్థిక స్తోమత లేని వారికి మా సంస్థ తరుపున ఉచితంగా న్యాయ వాదిని నియమిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్,పంచాయతీ కార్యదర్శి,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు అండగా ప్రభుత్వం

**- మూడేళ్లలో వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా**

**-- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

మహబూబ్‌నగర్, జూన్ 9 ( ప్రజా జ్యోతి బ్యూరో ) : సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించే గొప్ప సంక్షేమ పథకమని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం 80 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల్లో దాదాపు మూడు వేల మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేద ప్రజలకు కూడా ప్రభుత్వం సహాయం అందిస్తోందని చెప్పారు. ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుమారు రూ.3 వేల కోట్ల నిధులను కేటాయించినట్లు వెల్లడించారు. సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిబ్బందిని నియమించామని తెలిపారు. అవసరమైన పత్రాలు సమర్పించిన వారికి మూడు నెలల్లోనే చెక్కులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత ప్రభుత్వాలతో పోలిస్తే వేగవంతమైన వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి "ఇందిరమ్మ జీవన బీమా" పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. కుటుంబ పెద్ద మరణించిన సందర్భంలో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుందని తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో




సౌకర్యాలు పెంచుతూ వైద్యులను నియమించి మెరుగైన వైద్యం అందిస్తున్నామని, విద్య, వైద్యం, సాగునీటి రంగాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నియోజకవర్గంలో ఇప్పటికే 3,500 ఇళ్లు మంజూరు చేశామని, మరో 2,500 ఇళ్ల మంజూరుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, నగర డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, కార్పొరేటర్లు షబ్బీర్ అహ్మద్, అవేజ్, తాహేర్, భాను చందర్, మజ్జీద్, ఎంపీ ప్రవీణ్, నాయకులు రాములు యాదవ్, అజ్మత్ అలి, సల్మాన్, లీడర్ రఘు, శరత్, ఫైసల్, అక్బర్, మోయిజ్, అశ్వాక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్‌కు గర్వకారణంగా ఫూలే-అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్

**- నాణ్యతతో వేగంగా పనులు పూర్తి చేయాలి**

**- ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

మహబూబ్‌నగర్, జూన్ 9 ( ప్రజా జ్యోతి బ్యూరో ) : మహబూబ్‌నగర్ నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహం ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న ఫూలే-అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ పనులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న పనులను నాణ్యత ప్రమాణాలు తగ్గకుండా వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రీడింగ్ రూంలు, కాన్ఫరెన్స్ హాల్, తరగతి గదుల నిర్మాణాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించిన ఆయన, ఫూలే-అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ మహబూబ్‌నగర్‌కు గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు. గతంలో సూచించిన డిజైన్ ప్రకారమే నిర్మాణాలు కొనసాగించాలని, ముఖ్యంగా ప్రధాన ముఖద్వారం ఆకర్షణీయంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకునేలా రీడింగ్ రూంలలో సదుపాయాలు కల్పించాలని, ఓపెన్ హాల్ సీటింగ్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. అదేవిధంగా ఓపెన్ ఏరియాలో అందమైన గార్డెన్ ఏర్పాటు చేసి సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, నాయకులు లీడర్ రఘు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామాంజులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పరస్పర అంగీకారం ద్వారా పెండింగ్లో ఉన్న కేసులు కొట్టివేత..

**జిల్లా లీగల్ సర్వీసెస్ కార్యదర్శి శ్రీమతి వింధ్య నాయక్....**

నారాయణపేట ప్రతినిధి జూన్ 09 (ప్రజా జ్యోతి)


నారాయణపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరగబోయే జాతీయ లోక్ అదాలత్ ను ఉద్దేశించి సీనియర్ సివిల్ జడ్జి మరియు లీగల్ సర్వీసెస్ కార్యదర్శి శ్రీమతి వింధ్య నాయక్ గారు మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని న్యాయమూర్తి తెలిపారు. మే 9న జరగాల్సిన లోక్ అదాలత్ జూన్ 20న జరుగనుంది అన్నారు. తదుపరి నారాయణపేట జిల్లాలోని మొత్తం 14 పోలీస్ స్టేషన్ పరిధిలో పెండింగ్లో ఉన్న కేసులను గురించి ఆరాధించారు . వాటిని ఈ లోక్ అదాలత్ లో త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు నారాయణపేట టౌన్ మరియు రూలర్, మాగనూరు, మద్దూరు, దామరగిద్ద, ఉట్కూర్, కోస్గి, ధన్వాడ, మక్తల్, కృష్ణ, నర్వ, మరియు మరికల్, ఎక్సైజ్ ఇతర స్టేషన్ లలో ఈపెట్టి, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెండింగ్లో ఉన్నాయని టార్గెట్ గా ఉన్నాయని తెలిపారు. ఎక్సయిజ్ శాఖలో పెండింగ్ కేసులు ఉన్నాయా క్లియర్ చేయాలన్నారు. అన్ని కలిపి 6500 కేసులను టార్గెట్ గా అయన నిర్దేశించారు. కార్యక్రమం విజయవంతం చేయడానికి అన్ని టీములు సిద్ధంగా ఉండాలని ఈ లోక్ అదాలత్ ను కక్షిదారులు ఉపయోగించుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు యధావిధిగా కొనసాగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏజెండా లోని అంశాలు డ్యూటీ పిఎస్ చార్జిషీట్, సైబర్ క్రైమ్స్ గురించి చర్చించారు, ముందుగా గౌరవనీయులైన హై కోర్ట్ జుడ్గే ఆదేశానుసారం ముందుగా జైలు లో ఉన్న ఖైదీల కేసులను డిస్పోసల్ చెయ్యాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ చర్చ్ బి మనోజ్ కుమార్ గారు మాట్లాడుతూ ఈ జాతీయ లోక్ అదాలత్ లో పోలీసులందరూ సహకరించి జాతీయ ఉపయోగించుకొని రాజి మార్గం ద్వారా కేసులని తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి ఆదేశించారు.
ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి మరియు సెక్రటరీ డి ఎల్ ఎస్ శ్రీమతి వింధ్య నాయక్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీ బి మనోజ్, జూనియర్ సివిల్ జడ్జ్ శ్రీ అవినాష్ మరియు డిఫెన్స్ కౌన్సిల్స్ కె లక్ష్మి పతి గౌడ్, మరియు పోలీస్ అధికారులు, కోర్ట్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.



## వక్ఫ్ కాంప్లెక్స్ పై ఉన్న ప్రమాదకర హోల్డింగులను తొలగించాలి

**-ప్రజావాణి లో జిల్లా కలెక్టర్ కు వినతి**

నాగర్ కర్నూల్ : జూన్ 09(ప్రజా జ్యోతి)
నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని "వక్ఫ్ కాంప్లెక్స్" దుకాణ సముదాయాలపై ప్రమాధాకరంగా ఉన్న ఆధ్వర్టైజ్మెంట్ హోల్డింగులు ప్రమాధకరంగా మారి ఏ సమయంలోనైనా కూలపోయే అవకాశం ఉందని ప్రమాదం జరగకముందే తొలగించాలని ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు దుకాణ దారులు ఫిర్యాదు చేసారు.సంబందిత అధికారులు స్పందించి వేంటనే హల్డింగులను తొలగించాలని కోరారు.



## క్రీడాభివృద్ధికి కోచ్‌ల సేవలు కీలకం

**- స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కోచెస్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ**




**మహబూబ్‌నగర్, జూన్ 9 ( ప్రజా జ్యోతి బ్యూరో )**
స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కోచెస్ అసోసియేషన్ మహబూబ్‌నగర్ జిల్లా యూనిట్ రూపొందించిన క్యాలెండర్‌ను మంగళవారం స్పోర్ట్స్, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తన కార్యాలయంలో ఆవిష్కరించారు.
అనంతరం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ డైరెక్టర్ ఎ. సోనీ బాల దేవి చేతుల మీదుగా అసోసియేషన్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా క్రీడల అభివృద్ధిలో కోచ్‌ల పాత్ర ఎంతో కీలకమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ డీవైఎస్‌వో, క్రికెట్ కోచ్ మరియు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జె. రాజశేఖర్ రెడ్డి, అథ్లెటిక్ కోచ్ మరియు ప్రెసిడెంట్ ఎం. సునీల్ కుమార్, స్విమ్మింగ్ కోచ్ జిల్లా ట్రెజరర్ సయ్యద్ అంజాద్, వాలీబాల్ కోచ్ జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ అబ్దుల్ రెహ్మాన్ ఖాన్, బాక్సింగ్ కోచ్ జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ వి. శంకర్, కబడ్డీ కోచ్ జిల్లా జాయింట్ సెక్రటరీ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ క్రీడాకారులకు ప్రశంస పత్రాలు అందజేత

నాగర్ కర్నూల్ జూన్ 9 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)
ఏఆర్‌ఎం క్రికెట్ అకాడమీలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ లో శిక్షణ పొందిన క్రీడాకారులకు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ క్రీడాకారులకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏఆర్‌ఎం క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు క్రమశిక్షణతో పాటు కఠిన సాధన ద్వారా రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. అదేవిధంగా క్రీడల ద్వారా విద్యార్థులకు శారవిక మానసిక అభివృద్ధి ద్వారా పేర్కొన్నారు. సమ్మర్ క్యాంపులో పాల్గొన్న క్రీడాకారుల ప్రతిభను ఆయన అభినందించి భవిష్యత్తులో అరణ్య అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ఎం క్రికెట్ అకాడమీకు జావేద్ నాయకులు గోపాల్ రెడ్డి రామానాథం రెండోవాడు కౌన్సిలర్ సుంకరి నిర్మల బాలరాజ్ పాల్గొన్నారు



# ప్రతి రైతు విత్తనాలు కోనేటప్పుడు రసీదు తీసుకోవాలి

## ప్రభుత్వ పథకాల మీద అవగహన అవసరం డ్రగ్స్ మీద అవగాహన -చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కె. లక్ష్మీపతి గౌడ్

**నారాయణపేట ప్రతినిధి జూన్ 09 (ప్రజా జ్యోతి)**

నారాయణపేట జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం షేర్నపల్లి గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఇట్టి విజ్ఞాన సదస్సుకు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మీపతి గౌడ్ హాజరై గ్రామస్తులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల యొక్క భూసార పరీక్షలు చేయించుకొని, పంటల బీమా చేయించి, నష్టాలను అధిగమించవచ్చని తెలిపారు. నిత్యవసర సరుకుల చట్టం ద్వారా ప్రతి ఒక్క వ్యక్తి తమ యొక్క రసీదులను జాగ్రత్తపరచుకంటే నష్ట పరిహారం పొందే వెసలుబాటు ఉంటుందని, వ్యవసాయం అంటే కేవలం పంటలు పండించడం మాత్రమే కాదు, ఇది ఒక సంస్కృతి, జీవన విధానం. మనకు కావాల్సిన ఆహారాన్ని అందించేది వ్యవసాయమే. బాల్యవివాహాలు, బాలకార్మిక చట్టాలు, ఆడ పిల్లలకు చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయడం నేరమని తెలిపారు. పిల్లలకు చిన్నతనం నుండి మంచి రక్షణ మరియు విద్యావకాశాలు కల్పిస్తే, వారి భవిష్యత్తు (దేశ భవిష్యత్తు) సురక్షితంగా ఉంటుంది అని తెలిపారు.



యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ట్రోల్ ఫ్రీ నెంబర్ 15100 కి కాల్ చేసి ఉచిత న్యాయాన్ని పొందవచ్చు అని తెలియజేశారు. ఇట్టి కార్యక్రమానికి శైలజ (షేర్నపల్లి గ్రామా పంచాయతీ సెక్రటరీ) అనురాధ ( గ్రామా సర్పంచ్), శ్యామప్ప (నారాయణపేట రురల్ కానిస్టేబుల్) భాగ్యరేఖ (అంగన్వాడీ టీచర్) వార్డ్ మెంబెర్స్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నిర్వహణపై ఈఎస్ఐ డాక్టర్ల బృందం తనిఖీ

**నాగర్ కర్నూల్ : జూన్ 09(ప్రజా జ్యోతి)**

క్షయవ్యాధి నిర్మూలనకు లో చేపడుతున్న కార్యక్రమాల పనితీరు,వ్యాధిగ్రస్తుల స్థితిగతులను తెలుసుకునేందుకు ఈ.ఎస్.ఐ డాక్టర్ల బృందం మంగళవారం జిల్లాలోని వివిధ గ్రామాలను సందర్శించి పనితీరును తనిఖీ చేసి క్షయ వ్యాధి నిర్మూలనకు,వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం గ్రామ గ్రామాన క్యాంపులు నిర్వహిస్తూ అవసరమైన వారికి సహాయ సహకారాలు అందజేస్తూ గత 15 నెలలుగా విస్తృత కార్యక్రమాలు చేపట్టిన భవిష్య భారత్ అనే స్వచ్ఛంద సంస్థ జిల్లాలోని నాగర్ కర్నూల్,అచ్చంపేట,కొల్లాపూర్,కల్వకుర్తి నియోజ కవర్గాలలో సంస్థ కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది.స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో భవిష్య భారత్ అనే స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన కార్యక్రమాలను తెలుసుకునేందుకు ఇంపాక్ట్అసెస్మెంట్ పేరుతో ఈ.ఎస్.ఐ మెడికల్ కళాశాల అసోసియేట్ ప్రొ:డా.మహేష్ పురి,నేతృత్వంలోని డాక్టర్లు జీవన్,ఎస్ మేఘన,ధీరజ్,మేఘన లబృందం నాగర్ కర్నూల్,బిజినేపల్లి మండలం పాలెం,తిమ్మాజీపేట మండల కోడుపర్తి,నేరెళ్లపల్లి గ్రామాలలో తిరిగి వివరాలు సేకరించింది.పాలెం గ్రామంలో గ్రామ సర్పంచ్ బోనాసి రామకృష్ణ,ఉప సర్పంచ్ గోవింద శ్రీనివాసులు ఈఎస్ఐ బృందం వెంట పర్యటించి వారు సేకరిస్తున్న వివరాలలో పాలుపంచుకున్నారు.ఆయా గ్రామాలలో భవిష్య భారత్ నిర్వహించిన క్యాంపుల ద్వారా క్షయ వ్యాధిగ్రస్తులను కలిసి వారికి వ్యాధి వ్యాపించిన వివరాలు,మందులు వాడుతున్న వివరాలు,తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకుంటున్నారా లేదా అనే విషయాలపై కూలంకషంగా వివరాలు సేకరించి 15 నెలలుగా భవిష్య భారత్ అందించిన సేవలు,గ్రామీణప్రజలకు ఉపయుక్తంగా ఉన్నాయా లేవా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రజల నుండి,రోగుల నుండి అందిన సమాచారంపై బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. రాబోయే రోజుల్లో మరింతగా భవిష్య భారత్స్వచ్ఛంద సంస్థ పనిచేయడానికి మార్పులు చేయదలచిన కార్యక్రమాలను ప్రజల నుండి అడిగి రాబట్టి ఆద్యంతం ప్రజలకు అందించిన సేవలు ఉపయుక్తంగా ఉన్నాయనే విషయాలను ప్రజల



50 pro

నుండి,రోగుల నుండి,ఆరోగ్య సిబ్బంది నుండి తెలుసుకొని బృందం తమ రికార్డులలో పొందుపరచుకున్నారు.రాబోయే రోజుల్లో మరో 15 నెలలు జిల్లాలో క్షయ రోగులకు,క్షయవ్యాధి నివారణకు,క్షయ వ్యాధి నిర్మూలనకు అధునాతన మొబైల్ ఎక్స్రే,సిబినాట్ ద్వారా వైద్య సేవలను దించడం,వ్యాధికి గురైన వారికి పౌష్టికాహారాన్ని అందించడం,టిబి మందులతో పాటు సపోర్టింగ్ గా బలవర్ధకమందులను అందజేయనున్నట్లు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు.కార్యక్రమంలో పాలెం సర్పంచ్ రామకృష్ణ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గ్రామీణ ప్రజలకు అందించాల్సిన ఆరోగ్య సేవలో తీసుకురావాల్సిన మార్పుల గురించి బృందం సభ్యులకు వివరించారు. ఈ.ఎస్.ఐబృందంతో పాటు భవిష్య భారత్ అధికారులు సంతోష్ అభిరామ్,కరుణాకర్,టీబి సూపర్వైజర్ శ్రీనివాసులు,జిల్లా మేనేజర్ రమేష్ డాక్టర్ సాయి దీప్తి,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు..

# జములమ్మ ఆలయంలో 'హలాల్' విధానాన్ని నిలిపివేసి'జట్కా'పద్ధతి అమలు చేయాలి

### ఆలయ ఈఓకు విహెచ్పీ,బజరంగ్ దళ్ వినతిపత్రం

గద్వాల జూన్ 09 (ప్రజా జ్యోతి):గద్వాల పట్టణ పరిధిలోని జమ్మిచేడు గ్రామంలోని శ్రీ జములమ్మ దేవాలయంలో జంతు బలుల విషయంలో హిందూ సాంప్రదాయాలను గౌరవించాలని విశ్వహిందూ పరిషత్ (విహెచ్పీ),బజరంగ్ దళ్ నాయకులు డిమాండ్ చేశారు.ఆలయంలో ప్రస్తుతం కొనసాగుతున్నట్లు పేర్కొంటున్న 'హలాల్' విధానాన్ని నిలిపివేసి,హిందూ సంప్రదాయమైన 'జట్కా'పద్ధతిని అమలు చేయాలని కోరుతూ మంగళవారం దేవాలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) పురేందర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,శక్తి స్వరూపిణి అయిన అమ్మవారి ఆలయంలో హిందూ ఆచారాలకు అనుగుణంగా సంప్రదాయాలు కొనసాగాలని అన్నారు.జంతు బలుల విషయంలో హిందూ ధర్మ సంప్రదాయాల ప్రకారం 'జట్కా'పద్ధతినే అనుసరించాలని,ఈ అంశంపై ఆలయ యంత్రాంగం తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.భక్తుల మనోభావాలను గౌరవిస్తూ ఆలయ నిర్వహణలో హిందూ సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో విహెచ్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.ప్రవీణ్ కుమార్,బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ తిరుపతి మణి,కౌన్సిలర్ చంద్రశేఖర్,గాడ్సే మోహన్,వెంకటేష్, మనోజ్,శ్రీకాంత్,తిరుమలేష్,భాస్కర్,రాజు,పవన్‌తో పాటు విహెచ్పీ,బజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



# జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

### -- అచ్చంపేట మండల కార్యదర్శి వర్ధశీ సైదులు



అచ్చంపేట మార్చి 9 (ప్రజా జ్యోతి)
అచ్చంపేట నియోజకవర్గం లో ఉన్న ప్రతి జర్నలిస్టుకు ప్రభుత్వం ఇండ్ల స్థలాలని కేటాయించాలని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు అచ్చంపేట మండల కార్యదర్శి వర్ధ0 సైదులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య ఉంటూ ప్రజాస్వామ్యంలో నాలుగోవ స్తంభం లాగా జర్నలిస్టులు విధులు నిర్వహిస్తున్నారని వారు అన్నారు పేద ప్రజల కోసం ప్రభుత్వాలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల దగ్గరికి తీసుకపోవడానికి విలేకరుల పాత్ర ఎంతగానో ఉందని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని వారు కోరారు ఎలాంటి గౌరవ వేతనం లేకుండా సామాజిక బాధ్యతతో జర్నలిజంలో కొనసాగుతున్నారని వారు రాష్ట్ర ప్రభుత్వానికి గుర్తు చేశారు గత ప్రభుత్వంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని పది సంవత్సరాలుగా గత ప్రభుత్వం చెబుతూ చేతులు దులుపుకున్నారని వారు గుర్తు చేశారు అచ్చంపేట నియోజకవర్గంలో వివిధ మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు 14 సంవత్సరాలుగా ఇండ్ల స్థలాల కోసం వేచి చూస్తున్నారని ఆరోపించారు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఎన్నికల్లో ఇచ్చిన ఇండ్ల స్థలాల వాగ్దానాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు

# రూరల్ సర్కిల్‌పై ఎస్పీ ఫోకస్..

### - పెండింగ్ కేసులు, నేర నియంత్రణపై కఠిన ఆదేశాలు




**మహబూబ్‌నగర్, జూన్ 9 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :**
మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖలో నేర నియంత్రణ, కేసుల దర్యాప్తు, ప్రజా భద్రత అంశాలపై జిల్లా ఎస్పీ దరావత్ జానకి ప్రత్యేక దృష్టి సారించారు. మంగళవారం మహబూబ్‌నగర్ రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించిన ఎస్పీ, కార్యాలయ పనితీరు, రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల స్థితి, పోలీసు స్టేషన్ల పరిపాలనా వ్యవహారాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ రూరల్, హన్వాడ, నవాబుపేట, కోయిలకొండ, మహమ్మదాబాద్ పోలీస్ స్టేషన్ల పనితీరును పరిశీలించిన ఎస్పీ, కేసుల దర్యాప్తులో నాణ్యత పెంచాలని అధికారులకు స్పష్టం చేశారు. ముఖ్యంగా గ్రేవ్, సెన్సిటివ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పెండింగ్ వారెంట్ల అమలును వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించిన ఎస్పీ, బాధితులకు సత్వర న్యాయం అందేలా స్పందన ఉండాలని సూచించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు.
మాదకద్రవ్యాల నిర్మూలన, సీసీటీవీ నిఘా విస్తరణ, రోడ్డు భద్రత చర్యల అమలు, గస్తీ వ్యవస్థ బలోపేతంపై ప్రత్యేక ఆదేశాలు జారీ చేసిన ఎస్పీ, మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ గాంధీ నాయక్ మరియు సర్కిల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

